ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154

హైందవ సంస్కృతికి పట్టుకొమ్మలు.. పల్లెలు

కమలానంద భారతీస్వామి


మాట్లాడుతున్న స్వామీజీ

పెనుకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భారతీయ జీవన విధానానికి, హైందవ సంస్కృతికి పట్టుకొమ్మలు పల్లెలు అని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి పేర్కొన్నారు. పల్లెలు ప్రస్తుతం రూపుమారిపోతున్నాయనీ, వాటి పునరుద్ధరణ దిశగా హిందూ యువత చైతన్య పాదయాత్ర చేపడుతున్నామన్నారు. జూలై 12న తిరుపతి నుంచి పాదయాత్ర మొదలవుతుందన్నారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం హిందూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడుతూ.. గ్రామీణ యువతలో చైతన్యం తెచ్చేందుకు పాదయాత్ర చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలోని తొమ్మిది కొత్త జిల్లాల్లో ఆరునెలలపాటు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. జానపదం, పౌరాణికం, సాంఘిక నాటకాలు, కూచిపూడి, భరతనాట్యం, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామాల్లోనే పుట్టాయన్నారు. అన్ని రకాల చేతివృత్తులు గ్రామీణప్రాంతాల్లోనే ఉన్నాయన్నారు. రానురాను వాటి జాడ కనమరుగవుతోందన్నారు. వాటిపట్ల యువతలో చైతన్యం తెచ్చి, పల్లెలను పునరుద్ధరించడమే లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బొక్సంపల్లి రామకృష్ణ, సభ్యులు డా.రంగనాథ్, వేదవ్యాస్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లేనిది ఉన్నట్లు..!



ఈ ఫొటోలో ఉన్నది పుట్టపర్తికి చెందిన చల్లా ఉమాదేవి, నరసింహనాయుడు దంపతులు.. వారి ఇద్దరు కుమారులు. పుట్టపర్తి ఈశ్వరమ్మ పాఠశాలలో పెద్ద కుమారుడు వేద నరసింహనాయుడు 9వ తరగతి, హరిహరదేవ నాయుడు 4వ రగతి చదువుతున్నారు. తల్లికి వందనం సొమ్ము జమ కాకపోవడంతో వార్డు సచివాలయానికి వెళ్లి విచారించారు. 'మీ పేరిట 230 ఎకరాల భూమి ఉంది. అందుకే జాబితాలో మీ పేరు లేదు' అని సిబ్బంది చెప్పారు. దీంతో వారు అవాక్కయ్యారు. కలెక్టరేట్‌కు సోమవారం వెళ్లి.. కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. తమకున్నది నాలుగున్నర ఎకరాలు మాత్రమేనని, కానీ 230 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించి 'తల్లికి వందనం' అందకుండా చేశారని వాపోయారు. న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

-ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి టౌన్

ఆన్‌లైన్‌లో ఎకరాలకు ఎకరాల భూమి



తాడిమర్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చదువులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరిట అద్భుతమైన పథకాన్ని అమలు చేస్తోంది. ఒక్కొక్కరి రూ.13 వేలు చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ లబ్ధి చేకూరుస్తోంది. వారి తల్లి ఖాతాలో సొమ్ము జమ చేస్తోంది. ఇటీవలే ఆ పథకం అమలులోకి వచ్చింది. అర్హత ఉండి.. సొమ్ము పడకపోతే వెంటనే దరఖాస్తులు సమర్పించాలని, అందరికీ సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం సూచించింది. దీంతో సొమ్ము జమకానివారు సచివాలయాలకు వెళ్లి కారణాలు తెలుసుకుంటున్నారు. అనర్హుల జాబితాలో ఉన్న అర్హులు.. తమకు సొమ్ము పడకపోవడానికి అధికారులు చేసిన పొరపాట్లే కారణమని తెలుసుకుని ఆవేదన చెందుతన్నారు. భూమి లేకపోయినా, కాస్త భూమి ఉన్నా.. 10 ఎకరాలకు పైగా మెట్ట భూమి ఉన్నట్లు చూపించి.. 'తల్లికి వందనం' అందకుండా చేశారు. అనర్హుల జాబితాలో మెజార్టీ పేదలు ఇదే కారణంలో నష్టపోయారు.

నేటి నుంచి గ్రీవెన్స్

తల్లికి వందనం అందని అర్హుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, న్యాయం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఫిర్యాదుల స్వీకరణ ప్రభుత్వం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో అర్హులైన తల్లిదండ్రులు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. సమస్య ఏమిటో గుర్తించి, పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. రాబోవు మూడు రోజుల పాటు బాధితులకు అందుబాటులోఓ ఉండి.. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఇస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. లేదంటే ఈ ఏడాది అందాల్సిన సొమ్ము వారికి దూరమౌతుంది.

లేని భూమి ఉన్నట్లు..

తాడిమర్రి మండలంలో 'తల్లికి వందనం' పథకానికి 4,239 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,435 మందికి సంబంధించి రూ.4,46,55,000 వారి వారి తల్లుల ఖాతాలో జమ అయింది. మరో 884 మందికి పథకం అమలు కావాల్సి ఉంది. తాడిమర్రి పంచాయతీలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 477 మంది దరఖాస్తు చేసుకోగా 338 మందికి

(మిగతా 6వ పేజీలో...)

యోగాతో మానసిక ఉల్లాసం: మంత్రి


యోగా చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి, కలెక్టర్ చేతన్, కియా ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రాచీన భారతదేశం అందించిన అమూల్యమైన బహుమతి యోగా అన్నారు. యోగాసనాలతో శారీరక, మానసిక దృఢత్వం సాధించవచ్చన్నారు. మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతామని అన్నారు. ముఖ్యమంత్రిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కియా సీఈఓ కవ్‌జేంగ్లి, లీగల్ అడ్వైజర్ యాంగ్లీమా, కంపెనీ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. 'తల్లికి వందనం' డబ్బులు అందరికీ అందాయా అని అడిగి తెలుసుకున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సవిత, చిత్రంలో కలెక్టర్ తదితరులు

కార్యాలయం ముందే వంటావార్పు


నిరసన తెలుపుతున్న వెంకటలక్ష్మమ్మ

గోరంట్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిమేకలపల్లికి చెందిన వెంకటలక్ష్మమ్మ సెంటు స్థలం కోసం తహసీల్దార్ కార్యాలయం ముందు వంట చేస్తూ వినూత్న రీతిలో సోమవారం నిరసన తెలిపారు. వెంకటలక్ష్మమ్మకు చాలాకాలం క్రితం ఇంటికోసం ప్రభుత్వం రెండు సెంట్ల స్థలం ఇచ్చింది. అందులో ఇంటిని నిర్మించుకోగా, మిగిలిన సెంటు స్థలం ఖాళీగా ఉంది. భర్త వెంకటేశ్వర్లు మృతిచెందాడు. 2024లో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగాధర్ రెడ్డి ఆమె ఇంటి సమీపంలోని తన పట్టా స్థలంలో చాలాకాలంగా రాగి చెట్టు, వేపచెట్టు ఉండడంతో గ్రామస్థుల అభిప్రాయం మేరకు అంతా కలిసి అశ్వత్థం కట్ట నిర్మించి నాగదేవతలను ప్రతిష్ఠించారు. దీంతో వివాదం మొదలైంది. సెంటు స్థలంలోని కొంతభాగంలో అశ్వత్థం కట్ట నిర్మించారనీ, దాన్ని తొలగించాలని వెంకటలక్ష్మమ్మ రెండున్నరేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తనకు న్యాయం చేయలేదంటూ ఆమె ఆందోళనకు దిగారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్దే మూడు రాళ్లతో పొయ్యి ఏర్పాటు చేసి, కూరగాయలు తెచ్చి వంట వండుతూ నిరసన తెలిపారు. తన ఇంటి రోడ్డుకు అడ్డంగా అశ్వత్థం కట్ట నిర్మిచారని ఆవేదన చెందారు. చాలాకాలంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం చేయకపోవడంతోనే ఆందోళన చేపట్టానన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మారుతిని అడగ్గా.. 1993లో ఆమెతో పాటు వారి బంధువులకు పది సెంట్ల స్థలం ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. మిగిలినవారెవరూ అందులో ఇళ్లు కట్టుకోకపోగా, మొత్తం స్థలం ఆమె ఆధీనంలో ఉందన్నారు. స్థల వివాదం పరిష్కారం కోసం పలుమార్గాలు చూసినా, ఆమె వినడంలేదన్నారు.

ఓర్వలేకనే జగన్ అసత్య ఆరోపణలు: ఎంపీ బీకే



పెనుకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే మాజీ ముఖ్యమంత్రి జగన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి పేర్కొన్నారు. సోమవారం పెనుకొండ ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అంచెలవారిగా అమలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే పెన్షన్ రూ.4వేలు, ఉచిత గ్యాస్, భూమిపై డిక్లరేషన్ వంటి వాటిని అమలు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం 68 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాలో డబ్బు జమచేశామని అన్నారు. వీటిని చూసి ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి కడుపుమండి తల్లికి వందనం పథకంలో రూ.2వేలు కోత విధించి ఆ డబ్బులు విద్యామంత్రి లోకేష్ ఖాతాలో జమచేసుకున్నాడంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మరని తెలిపారు.

బదిలీపై వెళ్తే పోస్టే లేదు..!

విద్యాశాఖలో మాయాజాలం.. బదిలీ టీచర్లకు షాక్

- కొత్త స్కూల్‌లో ఖాళీ లేదంట..!
- డీఈఓ ఆఫీసుకు పరుగులు
- పొరబాటా.. ఉద్దేశ పూర్వకమా..?



అనంతపురం విద్య, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఎంచుకున్న పాఠశాలలకు టీచర్లు ఆనందంగా వెళ్లారు. జాయినింగ్ అవుదామంటే కొత్త స్కూల్‌లో పెద్ద షాక్ ఇచ్చారు. ఆ స్కూల్‌లో సంబంధిత పోస్టు ఖాళీ లేదని చెప్పడంతో అవాక్కయ్యారు. బదిలీల్లో ఖాళీ చూపి, ఆప్షన్ తీసుకుని, కౌన్సెలింగ్‌లో కేటాయించిన పోస్టు లేకపోవడం ఏంటని ఉపాధ్యాయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇంత పకడ్బందీగా బదిలీలు నిర్వహించినా.. పోస్టులే లేకపోవడం ఏంటని అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇది విద్యాశాఖ మాయాజాలం అని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. కొందరు అక్రమాలకు తెరలేపి, తమ వారికి కోరుకున్న ప్లేస్ దక్కేలా చేసేందుకు ఈ కనికట్టు ప్రదర్శించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త స్కూల్‌లో పోస్టు ఖాళీ లేకపోవడంతో బదిలీ అయిన టీచర్లు గాలిలో ఉన్నారు. విద్యాశాఖాధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొరబాటా.. ఉద్దేశపూర్వకమా..?

టీచర్ల ప్లేస్‌ల మాయాజాలంపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖలో పనిచేస్తున్న కొందరు కుమ్మక్కై ఇలా అక్రమాలకు పాల్పడి తమ వారికి కోరుకున్న ప్లేస్ ఇప్పించారన్న ఆరోపణలు వస్తున్నాయి. డీఈఓ బదిలీల ప్రక్రియ కోసం కొందరిని డెప్యుటేషన్‌పై నియమించుకున్నారు. వారిలో ఒకరిద్దరు ఇలాంటి వ్యవహారాలు నడిపారన్న ప్రచారం జరుగుతోంది. ఖాళీలు ప్రకటించేటపుడు ఎస్‌ఏ పోస్టులను ఆ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ డీఈఓలు, ఎస్జీటీలకు సంబంధించి ఎంఈఓలు చూపిస్తారు. ఆ తర్వాత కూడా రాష్ట్రశాఖ పదేపదే (మిగతా 6లో..)

- చెన్నేకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న విజయనిర్మల తప్పనిసరి బదిలీ కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. బత్తలపల్లి స్కూల్‌ను కోరుకున్నారు. అక్కడ పోస్టు లేదన్నారు. ఆ తర్వాత అదే మండలంలోని ఈదులముష్టూరు పాఠశాలను ఎంచుకున్నారు. కౌన్సెలింగ్‌లో ఆ స్థానం ఖరారైంది. తీరా పాఠశాలకెళ్తే పోస్టు ఖాళీలేదని వెనక్కు పంపించారు. దీంతో డీఈఓ ఆఫీసుకు పరుగులు తీసుకుంటూ వచ్చారు.

భారతీరెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే

తెలుగు మహిళల డిమాండ్


నినాదాలు చేస్తున్న తెలుగు మహిళలు

పుట్టపర్తి రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేవిధంగా మాట్లాడటానికి తన చానల్‌లో అవకాశం కల్పించిన భారతీరెడ్డి క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. అమరావతి మహిళలపై వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాకేంద్రంలోని హనుమాన్ కూడలిలో సోమవారం ఆందోళన చేపట్టారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ మాట్లాడుతూ.. జగన్ మీడియాలో అమరావతి మహిళలను కించపరుస్తూ నీచంగా మాట్లాడించిన భారతీరెడ్డి.. క్షమాపణలు చెప్పేవరకు వదిలేది లేదన్నారు. భారతీరెడ్డి మహిళ అయి ఉండి ఇలా మాట్లాడించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లైవ్ డిబేట్‌లో పాల్గొన్న యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకుడు కృష్ణంరాజు, యజమాని భారతీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ర్యాలీలో హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతాబాయి, కార్యదర్శి మాధవి, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల అధ్యక్షురాళ్లు లావణ్య, గంగరత్నమ్మ, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, రాష్ట్ర శాలివాహన సాధికార సమితి కన్వీనర్ పోతులయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, నాయకులు గంగాధర్‌నాయుడు, రాజప్ప పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవపై

కసరత్తు..!



- రేపటిలోగా రైతుల ఈకేవైసీ పూర్తికి ఆదేశం
- జిల్లాలో 2,70,477 మంది అర్హులు
- ఇప్పటి దాకా 2,62,711 మందికి ఈకేవైసీ

6

సచివాలయ సిబ్బంది బదిలీలకు

శ్రీకారం

- ఆన్‌లైన్‌లో ప్రక్రియ చేపట్టేలా ఉత్తర్వులు
- వివరాల నమోదులో సిబ్బంది నిమగ్నం

6

ప్రజాఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వండి

సత్వరమే న్యాయం చేయండి : ఎస్పీ రత్న



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి చట్ట పరిధిలో ఉన్నవాటిని వెంటనే పరిష్కరించి, బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 80 అర్జీలు వచ్చాయి. వాటిని స్వీకరించిన ఎస్పీ రత్న.. ఫిర్యాదుదారులతో వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి, చట్ట పరిధిలో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, ఆర్థికమోసాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన వివాదాలు, సైబర్ నేరాలు తదితరాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

కొత్తచెరువులో డ్రామా..!

- ఆక్రమణలు తొలగించుకోవడంలో మాయలు
- రేకులు, మెట్లతో సరిపెట్టిన వైనం
- అధికారుల మార్కింగ్‌కు తిలోదకాలు



ఆక్రమణల తొలగింపునకు వేసిన మార్కింగ్ (వృత్తంలో..)

కొత్తచెరువు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆక్రమణలు కూల్చేసుకోవడంలో కొత్త డ్రామాకు తెరలేపారు. నాలుగురోడ్ల రహదారుల్లో ఆక్రమణల కూల్చివేతకు అధికారులు ఉపక్రమించారు. సర్వే చేసి, మార్కింగ్ వేశారు. ఇంతలోనే ఆక్రమణదారులు స్వచ్ఛందంగా కూల్చి వేసుకుంటామంటూ ముందుకొచ్చారు. ఇలాగైతే ప్రభుత్వానికి కూడా ఖర్చు తగ్గుతుందనుకున్నారు. తొలగింపులో కొత్త డ్రామాకు తెరలేపారు. అధికారులు వేసిన మార్కింగ్‌కు తిలోదకాలిచ్చారు. అక్రమ నిర్మాణాల ముందున్న రేకులు, మెట్లు, ప్లాట్‌ఫాంలను తొలగించుకుని మమ అనిపించారు. అక్రమ కట్టడాలను పూర్తిస్థాయిలో తొలగించుకున్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. అధికారులు వేసిన మార్కింగ్ మాత్రం చాలా దూరంలోనే ఉంది.

నామమాత్రంగా..

నాలుగురోడ్ల రహదారుల్లోని అక్రమ కట్టడాలకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మార్కింగ్ వేశారు. అక్కడి వరకు కట్టడాలను తొలగించుకోవాలంటూ నోటీసులు అందజేశారు. ఆ భవన యజమానులు మాత్రం నామమాత్రంగా నిర్మాణాల ముందున్న రేకులను తొలగించుకుంటున్నారు. పూర్తిస్థాయిలో తొలగించుకోకపోవడంతో రోడ్లు చిన్నగానే ఉన్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. పూర్తిస్థాయిలో తొలగించుకోకపోతే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది గదుల ముందు ఉన్న మెట్లు, ప్లాట్‌ఫాం మాత్రమే తొలగించుకుంటున్నారు. తాము అక్రమ నిర్మాణాలు తొలగించామంటూ బయటకు తెలిసేలా చేస్తున్నారు. పూర్తిస్థాయిలో తొలగించుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని మండల కేంద్రం ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మార్కింగ్ మేరకు తొలగిస్తాం: వన్నూరుస్వామి, ఆర్‌అండ్‌బీ జేఈ

శని, ఆదివారాలు సెలవు కావడంతో రోడ్ల విస్తరణ వాయిదా పడింది. ఒక ట్రెండు రోజుల్లో అక్రమ నిర్మాణాలను మార్కింగ్ మేరకు తొలగిస్తాం.



వరుస వానల దెబ్బ

కుళ్లిపోతున్న పత్తి

నీట మునిగి వేరుశనగకూ నష్టం

ఆవేదనలో అన్నదాతలు



ఎర్రగా మారి కుళ్లిపోతున్న పత్తి పంట

బొమ్మనహాళ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వరుస వానలు పత్తి, వేరుశనగ పంటలను దెబ్బతీశాయి. గత వారంలో మండలంలో మూడురోజులుగా కురిసిన వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి కాయలు చేనులోనే తడిసి, నల్లబడుతోంది. వేరుశనగ నీట మునిగి చెట్టు కుళ్లిపోతోంది. గోవిందవాడ గ్రామ శివారు ఇసుక పొలాల్లో బోర్ల కింద వేరుశనగ సాగు చేసి, నెల రోజులైంది. వర్షం వచ్చి నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. 70 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఉద్దేహాళ్, ఉప్పరహాళ్, లింగదహాళ్, రంగాపురం క్యాంప్ తదితర గ్రామాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కాయలోకి నీరు చేరి కుళ్లిపోతున్నాయని తెలిపారు. పత్తి మొక్కలు ఎర్రగా మారి వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. తీరా కోతకు సిద్ధమైన సమయంలో పంట ఇలా వర్షానికి దెబ్బ తినడం అన్నదాతకు తీవ్ర నష్టం మిగులుస్తోంది.

రెండెకరాల్లో పత్తికి నష్టం: శివరాజ్, ఉప్పరహాళ్



రబీలో బోరుబావి కింద రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టా. పంట చేతికొచ్చిన సమయంలో వర్షం కురిసి నష్టాన్ని మిగిల్చింది. పెట్టుబడులు కూడా దక్కవు. ఖరీఫ్ సాగుకు అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

అప్పులు తీరుతాయనుకుంటే..! మేటి సోమ, గోవిందవాడ



ఇసుక పొలంలో నాలుగెకరాల్లో వేరుశనగ పంటను నెల రోజులు క్రితం సాగు చేశా. పంట బాగా వచ్చింది. ఈసారి పంట పండితే అప్పులు తీరుతాయనుకున్నా. అంతలోని వరుస వానలకు పంట మొత్తం నీట మునిగి రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లింది.

వీలైనంత త్వరగా నీటిని తొలగించాలి



అధిక వర్షాలు కురవడంతో పత్తిపంట వాడుముఖం పడుతోంది. పత్తి పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వీలైనంత త్వరగా తీసేయాలి. యూరియా, పొటాష్ తదితరాలను వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచన మేరకు తగిన మోతాదులో వేసుకోవాలి.

-సాయికుమార్, మండల వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్



జంబులదిన్నె చెరువులో ఏపుగా పెరిగిన కంపచెట్లు

అడవుల్లా చెరువులు..!

● ఐదేళ్లలో మరమ్మతులు శూన్యం

● ఆయకట్టుకు అందని నీరు

గార్లదిన్నె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులు మరమ్మతుకు నోచుకోలేదు. ఫలితంగా చెరువుల్లో కంప చెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో జంబులదిన్నె, యర్రగుంట్ల, తిమ్మంపేట, పాపిణేపాళ్యం, కోటంక, మర్తాడు తదితర చెరువుల్లో కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో చెరువులకు నీరు సక్రమంగా పారడం లేదు. చెరువులు అడవులను తలపిస్తుండడంతో వివిధ జంతువులు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా జంబులదిన్నె గ్రామస్థులు ప్రతిరోజూ గార్లదిన్నెకు రావాల్సి ఉంటుంది. జంబులదిన్నె నుంచి గార్లదిన్నెకు రావడానికి చెరువు మధ్య ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు మీదనే ప్రయాణం చేయాలి. గ్రామానికి ఎలాంటి బస్సులు, ఆటోలు లేవు. దీంతో జంబులదిన్నె గ్రామస్థులు ద్విచక్ర వాహనాలు, నడుచుకుంటూ వెళుతుంటారు. రాత్రి సమయంలో ఆ రోడ్డు మీద వెళ్లేందుకు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరగడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కాక చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ పాలనలో చెరువులకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేస్తే ఆయకట్టు రైతులతో పాటు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.



గుంతలమయమైన జంబులదిన్నె రోడ్డు

గ్రామానికి వెళ్లేందుకు భయపడుతున్నాం



గార్లదిన్నె నుంచి జంబులదిన్నెకు పోవాలంటే చెరువులోని మట్టిరోడ్డు మీదుగా వెళ్లాలి. చెరువులో చెట్లు అధికంగా పెరగడంతో రాత్రి సమయంలో గ్రామానికి పోవాలంటే భయంగా ఉంటుంది. రోడ్డు కూడా గుంతలమయమైంది. చెరువులోని చెట్లను తొలగించడంతో పాటు రోడ్డు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

-పుల్లన్న, జంబులదిన్నె

చెరువుకు మరమ్మతులు చేయిస్తాం



2014లో తెలుగుదేశం హయాంలో జంబులదిన్నె చెరువుకు సుమారు రూ.25 లక్షలతో మరమ్మతులు చేయించాం. వైసీపీ హయాంలో చెరువుకు ఎలాంటి నిధులు రాలేదు. ఫలితంగా చెరువులో పెద్దఎత్తున చెట్లు పెరిగాయి. మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే చెట్లను తొలగించడంతో పాటు తూములకు మరమ్మతులు చేయించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చేస్తాం.

- రాంభూపాల్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు, జంబులదిన్నె

మత్స్యకారులు నష్టపోతున్నారు..



చెరువులో కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో చెరువులో చేపపిల్లలు అభివృద్ధి కాలేదు. జంబులదిన్నె చెరువు ద్వారా 42 మంది పైగా మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నాం. చేపలు పట్టుకునే సమయంలో వలలు చెట్లకు తగులుకుని తెగిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. చెరువులో పెరిగిన కంపచెట్లు, తుమ్మచెట్లు తొలగిస్తే మత్స్యకారులతో పాటు ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది.

- నాగప్ప, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, జంబులదిన్నె

ఈకేవైసీ తప్పనిసరి

'అన్నదాతా సుఖీభవ'కు ప్రత్యేకంగా అవసరం లేదు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

యాడికి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. సోమవారం యాడికిలోని రైతుసేవాకేంద్రంలో ఈకేవైసీ నమోదును ఆమె పరిశీలించారు. ఈకేవైసీ నమోదుపై వ్యవసాయశాఖ అధికారులు, రైతులతో వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాతా సుఖీభవ పథకం కోసం రైతులు ప్రత్యేకంగా ఈకేవైసీ చేసుకునే అవసరం లేదన్నారు. రైతులు ఇదివరకే వేర్వేరు పథకాల కోసం ఈకేవైసీ చేసుకుని ఉంటే అదే సరిపోతుందని వివరించారు. అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులా, అనర్హులా అని తెలుసుకునేందుకు రైతుసేవా కేంద్రంలో గానీ, ఇంటర్నెట్‌లో ఆధార్ కార్డు ద్వారా కానీ స్టేటస్ తెలుసుకోవచ్చని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు యంత్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి అశోక్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, సహాయ గణాంక అధికారి శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మార్కెటింగ్ శాఖ ఏడీ



మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్

అనంతపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీగా రాఘవేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ మార్కెటింగ్ శాఖ ఏడీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు మార్కెట్ కమిటీల కార్యదర్శులు, ఏడీ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మార్కెట్ కమిటీల కార్యదర్శులు, ఉద్యోగుల సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు. మార్కెట్ ఫీజు వసూలు ఇతరాత్ర వాటిలో రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తా అన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు.

సచివాలయ సిబ్బంది బదిలీలకు శ్రీకారం

● ఆన్‌లైన్‌లో ప్రక్రియ చేపట్టేలా ఉత్తర్వులు

● వివరాల నమోదులో సిబ్బంది నిమగ్నం

అనంతపురం న్యూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా అర్హత కలిగిన సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో యంత్రాంగం నిమగ్నమైంది. అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులు 483 ఉండగా.. 429 మంది పని చేస్తున్నారు. 54 ఖాళీలున్నట్లు అధికారులు తేల్చారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 పోస్టులు ఉండగా.. 334 మంది పనిచేస్తున్నారు. 85 ఖాళీలున్నాయి. వీరిలో ఉద్యోగంలో చేరినప్పట్నుంచి ఒకేచోట మే 31 వరకు పనిచేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్లు పూర్తికాని వారు రిక్వెస్ట్ పెట్టుకోవచ్చు. ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఖాళీల వివరాలు కూడా హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బకాయిలు చెల్లించేవరకు రిలీవ్ చేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ వరకు మాడ్యూల్‌లో వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. 22 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో బదిలీల అభ్యర్థన పెట్టుకోవచ్చు. 25 నుంచి 29 వరకు వాటిని పరిశీలించనున్నారు. 30న ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి కలెక్టర్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ల బదిలీ

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ స్థాయి వరకు పలువురికి బదిలీలు జరిగాయి. జూమ్ ద్వారా సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మధు తెలిపారు. ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ అవుతారని తెలిపారు. పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి, పలువురు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. బదిలీల వివరాలు మంగళవారం తెలిసే అవకాశం ఉందని అన్నారు.

అన్నదాతా సుఖీభవపై కసరత్తు..!

● రేపటిలోగా రైతుల ఈకేవైసీ పూర్తికి ఆదేశం ● 2,70,477 మంది రైతులు అర్హులుగా గుర్తింపు ● ఇప్పటి దాకా 2,62,711 మందికి ఈకేవైసీ

అనంతపురం అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 20 లేదా 21వతేదీ అన్నదాతా సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది రైతులతో ఈకేవైసీ చేయించడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 2,70,477 రైతులు అన్నదాతా సుఖీభవకు అర్హులుగా గుర్తించారు. ఆ మేరకు రైతు సేవా కేంద్రాలకు జాబితా వెళ్లింది. అందులో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులతో నమోదు చేయిస్తున్నారు. గత నెల మొదటి వారంలో వెబ్ ల్యాండ్ ఆధారంగా అర్హులైన రైతుల జాబితాను తయారుచేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 2,62,711 మంది రైతులకు సంబంధించి ఈకేవైసీ పూర్తయింది. ఇందులో కొందరు రైతులతో ఆర్ఎస్‌కే సిబ్బంది ఈకేవైసీ వేయించుకోగా.. మరికొందరు రైతులకు సంబంధించి గతంలో ఈ క్రాపింగ్, ఇతర ఈకేవైసీల ఆధారంగా ఆటోమేటిక్‌గా ఆన్‌లైన్‌లో ఈకేవైసీ పూర్తయింది. జిల్లాలో ఇంకా 7,766 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. పెండింగ్‌లోని రైతులతో మాత్రమే ఈనెల 18వతేదీలోగా ఈకేవైసీ వేయించుకోవాలని సోమవారం కమిషనరేట్ నుంచి వ్యవసాయ అధికారులకు సమాచారం అందింది. గత ప్రభుత్వం హయాంలో ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో, కేంద్రం మూడు విడతల్లో జమ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.7500, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6000 జమ చేస్తూ వచ్చారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుతం సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నదాతా సుఖీభవ కింద ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా అన్నదాత సుఖీభవ సొమ్మును జమ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

బదిలీపై వెళ్తే పోస్టే లేదు..!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి పక్కా ఖాళీలను చూపించాలని ఆదేశించింది. అపుడు కూడా డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలను జిల్లాకేంద్రానికి పిలిపించుకుని, వెరిఫై చేయించారు. ఆ తరువాతే ఖాళీలను రాష్ట్ర శాఖకు పంపగా.. అపుడు ప్రకటించారు. అలాంటపుడు ఖాళీలు ఎక్కడికెళ్లాయనేది అర్థంకాని ప్రశ్న. డీఈఓ ఆఫీసులో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇద్దరు పక్కా ప్రణాళికతోనే ఇలాంటి అవకతవకలకు పాల్పడ్డారనే అనుమానాలు బలపడుతున్నాయి. ఏదిఏమైనా విద్యాశాఖ మాయాజాలంలో బదిలీల్లో కోరుకున్న పాఠశాలలో పోస్టులు లేక ఆయా టీచర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

● బొమ్మనహాళ్ మండలం శ్రీధరగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న రంగేనాయక్ బదిలీల్లో మడకశిర మండలం కెంకర ఎంపీయూపీఎస్‌కు ఆప్షన్ పెట్టుకున్నారు. ఆ ప్లేస్ కేటాయించారు. జాయిన్ అవడానికి అక్కడికెళ్తే పోస్టు ఖాళీలేదని ఎంఈఓ చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

● రాప్తాడు మండలం గంగులకుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీచర్ ఓబులేసు బదిలీకి దరఖాస్తు చేసుకుని, ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన మాన్యువల్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. బెళుగుప్ప మండలం రామసాగరం పాఠశాలను కోరుకున్నారు. బదిలీ ఆర్డర్ మాత్రం అదే మండలంలోని శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలకు ఇచ్చారు. అక్కడికెళ్తే పోస్టు ఖాళీలేదంటూ పెద్ద షాక్ ఇచ్చారు.

● రాధాక్రిష్ణ అనే టీచర్‌ది వింత బాధ. ఈయన పెద్దవడుగూరు మండలం రామరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్నారు. తప్పనిసరి బదిలీ కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరై గుత్తి మండలం మాముడూరు కోరుకున్నారు. ఆప్షన్ ఫాంలో సంతకం కూడా పెట్టి వెళ్లారు. అక్కడ ప్లేస్‌లు చూపిస్తున్న ఆఫీస్ టెక్నీషియన్ దానిని ఫ్రీజ్ చేయకుండా వదిలేశారు. దీంతో మరుసటిరోజు కొనసాగిన కౌన్సెలింగ్‌లో ఆయనకన్నా వెనుక ఉన్న, శెట్టూరు మండలంలో పనిచేస్తున్న వరలక్ష్మి హాజరుకాగా, ఆమె గుత్తి మండలంలో చూపాలని కోరారు. అపుడు మాముడూరు ఖాళీ కనిపించడంతో కోరుకున్నారు. ఆమెకు కేటాయిస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. అంతకన్నా ముందుగా కోరుకున్న రాధాక్రిష్ణకు బదిలీ ఉత్తర్వులు రాక ఎనిమిదేళ్లు పూర్తయినా ఇపుడు గాల్లో ఉండాల్సి వచ్చింది. న్యాయం చేయాలని ఆయన.. విద్యాశాఖ అధికారులను కలిసి కోరారు. ఇవికి మచ్చుకు కొన్ని మాత్రమేనని ఉపాధ్యాయవర్గాలు అంటున్నాయి. ఇలాంటి బాధితులు ప్రతి కేడర్‌లో పదుల సంఖ్యలో ఉన్నారని చర్చించుకుంటున్నారు.

పొరబాట్లను సరిదిద్దుతాం: ప్రసాద్‌బాబు, డీఈఓ

బదిలీలో పోస్టులు చూపించడంలో కొన్నిపొరబాట్లు జరిగాయి. మరికొన్ని సాంకేతిక సమస్యలతో ఉత్పన్నమయ్యాయి. కోరుకున్న ప్లేస్‌లు లేవని కొందరు టీచర్లు వస్తున్నారు. వారి వినతులు తీసుకుని, పొరబాటు ఎక్కడ జరిగిందో పరిశీలిస్తున్నాం. సమస్యను పరిష్కరించి, అందరికీ ప్లేస్‌లు ఇస్తాం. సిబ్బంది ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసి ఉండుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

నేడు నోటు పుస్తకాల పంపిణీ

అనంతపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల పిల్లలకు మంగళవారం ఉదయం ఉచిత నోటుపుస్తకాల పంపిణీ చేస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు సోమవారం తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని, దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే నోటుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'మట్టి వినాయకులే మేలు'

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని నగరవాసులు మట్టి వినాయకుల ప్రతిమలు (విగ్రహాలు) మాత్రమే వినియోగించి పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి కోరారు. ఈ మేరకు నగరంలో మట్టి వినాయకుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులకు సూచించారు. పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలు, విగ్రహాల తయారీదారులు, హస్తకళాకారులు మట్టితో వినాయకులను తయారు చేసి వినియోగించాలని కోరారు. పీఓపీ, ప్లాస్టిక్, థర్మాకోల్ వాడకుండా విగ్రహాలను తయారు చేయాలన్నారు. పర్యావరణ అనుకూలమైన మట్టి పదార్థాలను ఉపయోగించడంతో నిమజ్జన సమయంలో కాలుష్యం లేకుండా నివారించవచ్చని తెలిపారు. మట్టి వినాయ కులను పూజిద్దాం-పర్యావరణం పరిరక్షించుకుందాం అనే నినాదంతో వినాయకచవితి జరుపుకుందామని పిలుపునిచ్చారు.

నేటి నుంచి కేంద్ర కమిటీ పర్యటన

అనంతపురం అర్బన్ , జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్ మంగళవారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల పర్యటన షెడ్యూల్ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కమిటీ సభ్యులు జిల్లాకు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ వినోద్‌కుమార్‌తో సమావేశమవుతారు. సాయంత్రం 5 గంటలకు డ్వామా కార్యాలయంలోని జలశక్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. ఈనెల 18న ఉదయం 9 గంటలకు శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యకలాపాలను పరిశీలిస్తారు. చెక్ డ్యాంల పరిశీలనతో పాటు చిజిల్ నాగలితో లోతు దుక్కి చేయడాన్ని పరిశీలిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారు. 11 గంటలకు తాడిపత్రిలో మురుగునీటి శుద్ధికర్మాగారాన్ని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తాడిపత్రిలోని ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాంపాండ్స్‌ను పరిశీలిస్తారు. 3.30 గంటల నుంచి గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని పరిశీలిస్తారు. ఈనెల 19వతేదీ ఉదయం 9 గంటలకు కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. అనంతరం ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను పరిశీలిస్తారు.

7,152 మంది టీచర్ల బదిలీ

సహకరించిన అందరికీ ధన్యవాదాలు

జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు


అనంతపురం విద్య, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. దాదాపు నెలరోజులుగా టీచర్ల బదిలీల ప్రక్రియ కొనసాగుతూ వచ్చిందన్నారు. రాష్ట్ర శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో టీచర్ల బదిలీల ప్రక్రియను పగడ్బందీగా చేపట్టామని అన్నారు. రికార్డుల ఆధారంగా జిల్లాలో అన్ని కేడర్ల టీచర్లు కలిపి 7,152 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని తెలిపారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు 133 మంది, ఎస్‌ఏ ఇంగ్లీష్ 511, ఎస్‌ఏ హిందీ 238, ఎస్‌ఏ తెలుగు 386, లెక్కలు 647, ఫిజికల్ సైన్స్ 518, బయాలజికల్ సైన్స్ 510, సోషియల్ 415, పీడీలు 415 మంది చొప్పున బదిలీ అయ్యారని వివరించారు. అలాగే సెకెండరీగ్రేడ్ టీచర్లు(ఎస్జీటీలు) 3,142 మంది స్థాన చలనం పొందారని అన్నారు. ఇతర ఉర్దూ, కన్నడ, వివిధ కేడర్లు కలిపి 464 మంది బదిలీ అయ్యారని డీఈఓ అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి నగరపాలక, మున్సిపాలిటీ టీచర్లతో పాటు ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలలో పనిచేసే టీచర్లందరినీ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బదిలీలు నిర్వహించామని పేర్కొన్నారు. బదిలీల ప్రక్రియకు సహకరించిన రాష్ట్ర ఉన్నతాధికారులు, కలెక్టర్, ఆర్జేడీ, స్పెషల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

లేనిది ఉన్నట్లు..!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు జమయ్యాయి. ఇంకా 139 మందికి రావాల్సి ఉంది. వీరిలో అధిక శాతం మందికి 10 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు పొరపాటుగా చూపించారు. కానీ రెండు ఎకరాలకు మించి భూమి లేనివారు చాలామంది ఉన్నారు. అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాలతో మకు సొమ్ము దూరమైందని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పది ఎకరాల భూమినైనా ఇవ్వండి..




నాకు ఇద్దరు కూతుళ్లు. మమత 10వ తరగతి, నవనీత 7వ తరగతి చదువుతున్నారు. ఉన్నది 1.79 ఎకరం భూమి. అది కూడా ప్రభుత్వం ఇచ్చిందే. కానీ ఆన్‌లైన్‌లో 10 ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపుతోంది. అనర్హుల జాబితాలో చేర్చి.. 'తల్లికి వందనం' అందకుండా చేశారు. మేము పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చూపినట్లు మాకు 10 ఎకరాల భూమిని ఇప్పిస్తే.. మరో 5 పాడి పశువులు పెంచుకుని పాలు అమ్ముకుంటాం. లేదంటే 'తల్లికి వందనం' ఇప్పించాలి.

-లక్ష్మీనారాయణమ్మ, తాడిమర్రి



తాడిమర్రి సచివాలయంలో తల్లికి వందనం గ్రీవెన్స్ కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

ఉన్నది ఒకటిన్నర ఎకరమే..



మా కుమారుడు దినేష్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసి, రెండో సంవత్సరం చదువుతున్నాడు. మాకు 1.50 ఎకరా డి.పట్టా భూమి ఉంది. కానీ 10 ఎకరాలకు పైగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపించారు. 'తల్లికి వందనం' అందకుండా చేశారు.

-నాగవేణి, తాడిమర్రి

భూములే భూములు..

సోమందేపల్లి మండలంలో లేని భూమి ఉన్నట్లు చూపడంతో 741 మందికి 'తల్లికి వందనం' దూరమైంది. బాధితులతో తహసీల్దార్ కార్యాలయం సోమవారం కిటకిటలాడింది. బ్రాహ్మణపల్లికి చెందిన సయ్యద్ రియాజ్‌కు 90 సెట్లు భూమి ఉండగా 10 ఎకరాలు ఉన్నట్లు చూపించారు. వెలుగమాకులపల్లి నాగరాజుకు 2 ఎకరాలుంటే 10 ఎకరాలు, జూలకుంటకు చెందిన నరసింహులు 99 సెంట్లు ఉంటే పదెకరాలు, గుడిపల్లి అనంతమ్మకు 5 ఎకరాలు ఉంటే 10ఎకరాలు, కవితాబాయికి 4 ఎకరాలు ఉంటే 10 ఎకరాలు చూపించారు. మరికొందరికి సెంటు భూమి లేకున్నా పది ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపించారు. ఆధార్ నమోదులో తప్పిదాల కారణంగానూ కొందరికి పథకం అందలేదు. సాంకేతిక కారణాలతో తప్పిదాలు జరిగాయని, జాయింట్ ఎల్‌పీఎంలో, రీ సర్వేలో లోపాలవల్ల ఆన్‌లైన్‌లో భూమి ఎక్కువగా నమోదైందని ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి అన్నారు. సమస్యను పరిష్కరించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.



సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హత్య కేసులో దంపతుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యబాబు

పుట్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 14న జరిగిన నడిపి కంబగిరి హత్యకేసులో సోమవారం దంపతులు గుర్రమ్మ, పెద్దకంబగిరిలను అరెస్ట్‌చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెద్దకంబగిరి, నడిపి కంబగిరి తరచూ ఆస్తి తగాదాల్లో భాగంగా ఇంటికోసం గొడవపడేవారన్నారు. దీంతో గత శుక్రవారం రాత్రి మరోమారు గొడవపడ్డారని తెలిపారు. పెద్దకంబగిరి కత్తి తీసుకొని నిద్రిస్తున్న నడిపి కంబగిరిని హత్య చేశాడన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేయగా ఆస్తి కోసమే చంపినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. దీంతో భార్యభర్తలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఉదయం ధర్మవరం పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీ వద్ద చోటుచేసుకుంది. హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుళ్లు ఎర్రిస్వామి, వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన గుండుగోపాల్ (57) తాగుడుకు బానిసై అనునిత్యం కుటుంబ సభ్యులను వేధించేవాడు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. దీంతో క్షణికావేశంతో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా పరిశీలించారు. భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

కూడేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇప్పేరు గ్రామానికి చెందిన మహేష్ (23) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మహేష్ అనే యువకుడు గత కొంత కాలంగా గ్రామంలోని నల్లలమ్మ దేవతకు పూజలు చేస్తూ కుటుంబ పోషణకు ఆసరాగా ఉండేవాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో కుటుంబ సభ్యులు గమనించి శవాన్ని కిందికి దించారు. మృతుడి తండ్రి రామన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామానాయుడు తెలిపారు.

కొరివిపల్లిలో గుర్తుతెలియని కారు



శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరివిపల్లిలో గుర్తుతెలియని కారును వదిలేశారు. గ్రామంలో నాగేశ్వర రెడ్డి ఇంటి సమీపంలో 15 రోజులు కిందట రాత్రి సమయంలో ఏపీ04ఏవీ2088 నంబరు గల కారును గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. కారు యజమానులు వచ్చి తీసుకు వెళతారని గ్రామస్థులు భావించారు. ఎవరూ రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

భార్యకు గాయాలు



శ్రీహరినాయుడు (ఫైల్)

నంబులపూలకుంట, జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడకంటివారిపల్లి సమీపాన సోమవారం ఎద్దుల బండిని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముక్కంవారిపల్లికి చెందిన శ్రీహరినాయుడు(36) దుర్మరణం చెందగా.. అతడి భార్య సింధూజ గాయపడింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరినాయుడు స్వగ్రామమైన ముక్కవారిపల్లి నుంచి భార్య సింధూజతో కలిసి ద్విచక్రవాహనంలో గాండ్లపెంటలోని రెక్కమానుకు ఇంటి సరుకులకోసం బయల్దేరాడు. మార్గమధ్యలో పెడకంటివారిపల్లి సమీపాన ఎదురుగా వస్తున్న ఎద్దుల బండి ఢీకొట్టింది. దీంతో శ్రీహరినాయుడు అక్కడికక్కడే మృతిచెందగా, సింధూజ గాయపడింది. ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి ప్రైవేటు వాహనంలో తరలించారు. శ్రీహరినాయుడుకు ఇద్దరు కుమారులు, ఆరు నెలల చిన్నారి ఉన్నారు. ఎస్ఐ వలీబాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించి, శవాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

వాసాపురం బాబును కలిసిన పెద్దారెడ్డి

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ



వాసాపురం బాబుతో భేటీ అయిన పెద్దారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్16(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యదర్శి రవీంద్రనాయుడు అలియాస్ వాసాపురం బాబును తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. యల్లనూరు మండలానికి చెందిన వాసాపురం బాబు పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం యల్లనూరు మండలంలోని వాసాపురం గ్రామంలో ఆయనను వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కలవడం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీసింది. దీనిపై పార్టీ అధిష్టానం ఆరాతీసినట్లు తెలిసింది.

పోక్సో కేసులో తండ్రీకొడుకుల అరెస్టు

అనంతపురం క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థి, అతడి తండ్రిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, ప్రథమ సంవత్సరం విద్యార్థి ప్రేమించుకున్నారు. మైనర్లు ఇద్దరూ ఇటీవల రెండుసార్లు ఇంటి నుంచి పారిపోయారు. బాలిక తల్లిదండ్రులు పలుమార్లు చెప్పినా మార్పురాలేదు. మరోసారి బాలికను తీసుకుని ఒంగోలుకు పారిపోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన దిశ పోలీసులు.. బాలుడిని, అతడి తండ్రిని అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని దిశ డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

ఆస్తి కోసమే అపహరణ

- మారుతమ్మను ఎత్తుకుపోయిన తల్లిదండ్రులు, బంధువులు
- మరిదిని పెళ్లి చేసుకోవాలని బెంగళూరులో చిత్రహింసలు
- కేసును ఛేదించిన పోలీసులు.. 11 మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు



టీచర్ మారుతమ్మ ప్రియుడు ఎర్రిస్వామి

కళ్యాణదుర్గం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయని మారుతమ్మను కన్న తల్లిదండ్రులు, బంధువులు ఆస్తి కోసం అపహరించారని డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన మేరకు, కంబదూరు మండలం కురాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో మారుతమ్మ ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. 2016లో ఆమెకు టీచర్ ఉద్యోగం వచ్చింది. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి ఆమె స్వగ్రామం. ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులు ఆనంద్, శ్యామలమ్మ, చెల్లెలు మహాలక్ష్మిని ఆమె పోషిస్తున్నారు. కుటుంబ పోషణకు పోనూ మిగిలిన సొమ్ముతో 15 తులాల బంగారం, అనంతపురంలో ఓ ఇంటి స్థలం కొనుగోలు చేశారు. మారుతమ్మకు పెళ్లి చేస్తే తమ జీవనానికి ఇబ్బంది అవుతుందని తల్లిదండ్రులు, చెల్లెలు భావించారు. అందుకే ఉద్యోగం వచ్చి 9 సంవత్సరాలు గడిచినా మారుతమ్మ పెళ్లి చేయలేదు. మారుతమ్మ సుమారు 20 ఏళ్ల నుంచి బెళుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన ఎర్రిస్వామిని ప్రేమిస్తున్నారు. ఎర్రిస్వామికి వివాహమై, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా ఎర్రిస్వామిని 20 రోజుల క్రితం మారుతమ్మ వివాహం చేసుకున్నారు. దీంతో వారు జీర్ణించుకోలేక పోయారు. ఎలాగైనా వారిని విడగొట్టాలని, లేదంటే చంపేయాలని తల్లిదండ్రులు, తమ్ముడు, మరిది, చెల్లెలు, మరో ఐదుగురు బంధువులు నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న మారుతమ్మ పాఠశాలకు వెళ్లి బైక్‌పై ఎర్రిస్వామితో కలిసి తిరిగి వస్తుండగా కంబదూరు మండలం కోటగుడ్డం వద్ద అడ్డగించారు. ఎర్రిస్వామిని తోసేసి, మారుతమ్మను కిడ్నాప్ చేశారు. తండ్రి ఆనంద్‌తో పాటు మరో 9 మంది బొలెరో వాహనంలో ఆమెను ఎత్తుకుపోయారు. ఈ ఘటనపై ఎర్రిస్వామి కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మారుతమ్మను కుటుంబ సభ్యులు, బంధువులు బెంగళూరుకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. చెల్లెలు మహాలక్ష్మి భర్త ఎల్లప్పను పెళ్లి చేసుకోవాలని, ఆస్తి, డబ్బు తమకు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. వారి నుంచి తప్పించుకునేందుకు మారుతమ్మ తెలివిగా ప్రవర్తించారు. మరిదిని పెళ్లి చేసుకుంటానని ఒప్పుకున్నారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆమెను బెంగళూరు నుంచి కళ్యాణదుర్గానికి తీసుకువస్తుండగా.. పోలీసులకు సమాచారం అందింది. కళ్యాణదుర్గం సమీపంలో ఈ నెల 15న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మారుతమ్మను రక్షించారు. ఆమె తల్లిదండ్రులు ఆనంద్, శ్యామలమ్మ, చెల్లెలు మహాలక్ష్మి, మరిది ఎల్లప్పతోపాటు ఏడుగురు బంధువులను అరెస్టు చేశారు. వారి నుంచి బొలెరో, ద్విచక్రవాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మూడు రోజుల్లోనే ఛేదింపు

టీచర్ కిడ్నాప్ కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్, టౌన్ సీఐ యువరాజు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కంబదూరు ఎస్ ప్రవీణ్, బొమ్మనహాల్ ఎస్ఐ నబీరసూల్, కణేకల్ ఎస్ఐ నాగమధు, పోలీస్ సిబ్బంది రాజేష్, ఖాజా, మంజునాథ్, నాగార్జున, మోహన్ కృష్ణ, రాజ్యలక్ష్మి, ఎస్‌బీ కానిస్టేబుల్స్ ఆంజినేయులు, మోహన్ తదతరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

విచ్చలవిడిగా మట్కా.. పేకాట..!

- నామమాత్రంగా దాడులు
- నిద్రావస్థలో పోలీసుశాఖ
- బహిరంగంగానే చీటీలు రాస్తున్న బీటర్లు



డీఎస్పీ కార్యాలయం

తాడిపత్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పరిశ్రమలతో తాడిపత్రి ఆర్థికంగా ముందంజలో ఉంటుంది. అదే రీతిలో ఇక్కడ మట్కా, పేకాట కూడా విచ్చలవిడిగా సాగుతున్నాయి. గతంలో వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే వారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇటీవల నేరుగానే బీటర్లు బహిరంగంగా చీటీలు రాస్తున్నారు. ఎక్కువ డబ్బులకు ఆశపడి నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడుతున్నాయి. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణలు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాడిపత్రి పట్టణం కర్నూలు, కడప, అనంతపురం మూడు జిల్లాలకు సరిహద్దు కావడంతో వేలమంది మట్కా ఆడడానికి కేంద్రబిందువు చేసుకున్నారు. నెల్లూరు, చిత్తూరు ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి మట్కా నిర్వహిస్తున్నారంటే ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ హయాంలో మట్కా బీటర్లకు కొందరు నాయకులు అండదండలు ఉండడంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆనవాయితీని ప్రస్తుతం కూడా కొనసాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

బహిరంగంగానే..

గతంలో వాట్సాప్, ఆన్‌లైన్‌లో మట్కాను ఆడేవారు. ప్రస్తుతం పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో బీటర్లు రెచ్చిపోతున్నారు. బహిరంగంగానే చీటీలు రాస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వందల సంఖ్యలో కూలీలు వలసవచ్చి జీవనం సాగిస్తున్నారు. సంపాదించిన కూలి డబ్బులను సాయంత్రమయ్యేసరికి మట్కా ఆడేందుకు ఆసక్తిచూపుతున్నారు. దీంతో సంపాదించిన డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలవుతున్నారు. ఈ మధ్యకాలంలో కొందరు మహిళలు కూడా మట్కాకు బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రంగా దాడులు చేయడం.. చిన్నాచితక వారిని అరెస్ట్ చూపడం, కొంత డబ్బును స్వాధీనం చేసుకోవడం తప్ప.. ముఖ్యమైన వ్యక్తులను అరెస్ట్ చేయలేదన్న విమర్శలు ఉన్నాయి.

రాయలసీమలోనే తాడిపత్రి టాప్

ఒకప్పుడు జిల్లాలో తాడిపత్రి మట్కా కింగ్‌గా ఉండేది. దినదినాభివృద్ధి చెంది రాయలసీమలోనే టాప్ ర్యాంక్‌లో తాడిపత్రి నిలిచింది. మట్కా కేంద్రాలను నిర్వహించే డాన్‌లకు సైతం తాడిపత్రి స్థిరనివాసంగా ఉండేది. అప్పట్లో లక్షల్లో టర్నోవర్ చేసేవారు. ప్రస్తుతం మట్కా ఆడే వారి సంఖ్య పెరగడంతో టర్నోవర్ కూడా కోట్లకు చేరింది. తాడిపత్రి పట్టణం, పెన్నానది పరివాహక ప్రాంతంలోని తోటలు, పరిశ్రమల్లో విచ్చలవిడిగా పేకాట నిర్వహిస్తున్నారు. పట్టపగలే ఎక్కడపడితే అక్కడ పేకాటస్థావరాలు వెలుస్తున్నాయి. పెన్నానదిలో కూడా ఆడుతున్నారంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

చర్యలు తీసుకుంటాం..



తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో మట్కా, పేకాటపై దాడులు నిర్వహిస్తున్నాం. ఇంకా కొన్నిచోట్ల ఆడుతున్నారని తెలిసింది. వారిని కూడా త్వరలో పట్టుకుంటాం. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మట్కా, పేకాటపై కమిటీ ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం. వీటిపై ప్రజలు సమాచారం ఇస్తే వారికి పారితోషికం కూడా అందజేస్తాం. వారిపేర్లను గోప్యంగా ఉంచుతాం.

- రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ

జగనన్న మాయాగృహాలు..!

- గత ప్రభుత్వంలో మోసం
- పట్టా ఇచ్చి.. స్థలం చూపని దుస్థితి..
- ఇల్లు కూడా మంజూరు చేశారట..
- పేదల సొంతింటి కలపై నీళ్లు

గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్లలో మాయాజాలమే ప్రదర్శించారు. కొందరికి ఇళ్ల పట్టాలిచ్చారు. స్థలం ఎక్కడో చూపలేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం లేఅవుట్‌ను కూడా చదును చేయలేదు. ఐదేళ్లూ అలానే గడిపేశారు. పేదల సొంతింటి కలపై నీల్లు చల్లారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఆ కల నెరవేర్చుకుందామని పేదలు.. ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళితే పెద్ద షాక్. గత ప్రభుత్వంలో స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేసినట్లు ఆన్‌లైన్‌తో చూపుతోంది. ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో పేదలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

నల్లమాడ, జూన్16(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో నిరుపేదల కోసం గత వైసీపీ ప్రభుత్వం స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. జగనన్న కాలనీ ఏర్పాటుకు ఉపక్రమించింది. నల్లమాడ సమీపంలోని పాతరకుంట వద్ద ప్రభుత్వ, ప్రైవేటు భూములు 18 ఎకరాలు సేకరించారు. ఆ భూమిలో చిన్న చిన్న గుట్టలు, బండరాళ్లు ఉన్నాయి. వాటిని తొలగించి, చదును చేసేందుకు రూ.60లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ఆ పనులు ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారు సొంత నిధులు వెచ్చించి చదును చేశారు. అనంతరం ఆ భూమిలో అర్హులైన వారందరికీ పట్టాలిస్తామని చెప్పి 500 మందికిపైగా పేర్లను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సమాచారం. ఇందులో 200 మందికి ఇళ్ల పట్టాలిచ్చినట్లు తెలుస్తోంది. స్థలం ఎక్కడుందో చూపలేదు. వారికి ఇళ్లు కూడా మంజూరుకాలేదు. పట్టాలిచ్చారనీ, ఇల్లు కూడా మంజూరు చేస్తారని పేదలు సంబరపడ్డారు. వారి ఆశలపై గత ప్రభుత్వం నీళ్లు చల్లింది. భూమిని చదును చేసిన కాంట్రాక్టర్లకు రూ.60లక్షల బిల్లులు కూడా రాలేదు. 18 ఎకరాల్లో రోడ్డు, నీటి సౌకర్యం, విద్యుత్ స్తంభాలుకానీ ఏర్పాటు చేయలేదు. మండలంలోని దొన్నికోట, పులగంపల్లి, బొంగపల్లి, రామాపురం, రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లి తదితర పంచాయతీల్లో జగనన్న కాలనీల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామాలకు దూరంగా ప్రభుత్వ భూములను చదును చేశారు. వాటిలో అరకొరగానే ఇళ్లు మంజూరు చేశారు. కొంతమంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. రెండు పంచాయతీల్లో మినహా జగనన్న కాలనీలన్నీ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. గతంలో లబ్ధిదారులు.. అధికారుల వద్దకెళ్లి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. ఇళ్లు మంజూరు చేయలేదు, కట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నేరవేర్చుకోవాలని లబ్ధిదారుల భావించారు. అధికారుల వద్దకెళ్లి పరిశీలించి గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరైందనీ, మళ్లీ ఆన్‌లైన్ చేయడం కుదరదని చెబుతున్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారు ఎక్కువమంది ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నల్లమాడ వద్ద జగనన్న కాలనీ కోసం చదును చేసిన భూమి

పట్టాలిచ్చారు.. స్థలాలు చూపలేదు



గత వైసీపీ ప్రభుత్వంలో నల్లమాడ సమీపంలో చదును చేసిన భూమి లో కొంతమందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. స్థలాలు చూపించలేదు. ఇళ్లు మంజూరు చేయలేదు. ఈ సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లినా, లబ్ధిదారులకు న్యాయం చేయలేదు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేపడతాం.

-కుచ్చెపు చంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

వసతులు కల్పించాక పట్టాలిస్తాం

నల్లమాడ సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో వసతులు కల్పించాల్సి ఉంది. భూమి కూడా పూర్తిస్థాయిలో చదును చేయాల్సి ఉంది. పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాలు అందజేస్తాం.

-రంగనాయకులు, తహసీల్దార్, నల్లమాడ

సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత నెల్లూరు



ట్రోఫీతో నెల్లూరు జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల విజేతగా నెల్లూరు జట్టు నిలిచింది. సోమవారం స్థానిక అనంతతపురం క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించారు. అనంతపురం-నెల్లూరు జట్లు తలపడగా..మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 48.5 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు ఎంకే దత్తారెడ్డి 58, అర్జున్ టెండూల్కర్ 43, మహేంద్రరెడ్డి 58, రాజుకుళ్లాయప్ప 44 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 49.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 296 పరుగులు సాధించింది. బ్యాటర్లు రేవంత్‌రెడ్డి 88, భాజీ 47 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు వికెట్ తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్ కడప, కర్నూలు జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 285 పరుగులు సాధించింది. బ్యాటర్లు దనుష్ 77, జయవర్ధన్ 57 పరుగులు చేశారు. అనంతఠం బరిలోకి దిగిన కర్నూలు కడప బౌలర్ల ధాటికి 179 పరుగులకే కుప్పకూలింది. సూర్యతేజ 45, సంజయ్‌నాయుడు 42పరుగులు చేశారు. కడప బౌలర్ దనుష్ 4, ఆరీఫ్‌బాషా 3 వికెట్లు సాధించి జట్టుకు 106 పరుగుల విజయాన్ని అందించారు. పాయింట్ల ఆధారంగా నెల్లూరు 16 విజేతగా, తరువాతి స్థానాల్లో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జట్లు నిలిచాయి. అనంతరం విజేత జట్టుకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి బీమలింగారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

మార్కెట్‌కు వెయ్యి టన్నుల చీనీ

అనంతపురంరూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వెయ్యి టన్నులకు పైగా చీనీ ఉత్పత్తులు వచ్చాయి. ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తంగా 1119టన్నుల కాయలు మార్కెట్‌కు వచ్చాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. టన్ను గరిష్టంగా రూ.32వేలు, కనిష్టంగా రూ.5వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేశారు

- వైసీపీ నాయకులపై జేసీపీఆర్ ఫైర్



మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జూన్16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేసి అధోగతి పట్టించి వెళ్లిపోయారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు పేర్నినాని, దేవినేని అవినాష్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు మంచితనమే మిమ్మల్ని కాపాడుతోందని అన్నారు. రాష్ట్రాన్ని చక్కదిద్దాలంటే చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. ఆయన మూడునెలలు పర్మిషన్ ఇస్తే టీడీపీ కార్యకర్తల సత్తా ఏమిటో చూపిస్తారని తెలిపారు. లోకేష్ యాత్ర పెడితే అడ్డుకోవడమే కాకుండా మాట్లాడుతున్న మైకును గుంజుకోలేదా అని ప్రశ్నించారు. పేర్నినాని భార్యపైన కేసులు పెట్టారని బాధపడుతున్నాడని, పేదలకు ఇచ్చిన బియ్యాన్ని నొక్కేయడం సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. తన భార్య మీద 10 కేసులు, కోడలిమీద రెండు కేసులు పెట్టిన ఘటనలు.. తమ ఇంటిలోకి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చి వెళ్లినది మర్చిపోయారా అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడి, ఎంతో కష్టపడి పార్టీని గట్టెక్కించారని అన్నారు. చంద్రబాబునాయకుడు కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసమే పనిచేస్తున్నారని, ఆయనకు కక్షసాధింపులు లేవని తెలిపారు. అందువల్లే మీరు ప్రశాంతంగా తిరగగలుగుతున్నారని వైసీపీ నాయకులకు గుర్తు చేశారు.

సోనాక్షి..!

స్కేటింగ్‌లో బుక్కరాయసముద్రం చిన్నారికి గోల్డ్‌మెడల్



బుక్కరాయసముద్రం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐదేళ్ల చిన్నారి సోనాక్షి స్కేటింగ్‌లో అదరగొట్టింది. కుమ్మర వేణుగోపాల్, మౌనిక దంపతుల కుమార్తె సోనాక్షి ఇటీవలే తిరుపతిలో నిర్వహించిన స్కేటింగ్ జోనల్ ర్యాంకింగ్ టోర్నీలో గోల్డ్‌మెడల్ సాధించింది. చిన్నారిని కోచ్‌లు, గ్రామస్థులు అభినందించారు.

పంచాయతీరాజ్‌లో సీతయ్య..!

- ఎవరి మాటా వినడు.. ఎక్కడ పనిచేసినా వివాదమే..
- నాయకుల పేర్లు చెబుతూ బెదిరింపులు
- చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు..

అనంతపురం న్యూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ పరిధి పీఆర్ఐ సబ్‌డివిజన్-2లో ఓ జేఈ సీతయ్యలా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు అంటే లెక్కలేనితనం. ఏకంగా వారి చాంబర్లలోకే వెళ్లి గట్టిగట్టిగా అరుస్తాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా, ఉన్నతాధికారులు చోద్యం చూశారట. ఎందుకంటే ఆ జేఈ.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతాడన్న చర్చ సాగుతోంది. ఆయన విషయాల్లో కలుగజేసుకోవాలంటే ఉన్నతాధికారులు సైతం ఆలోచిస్తారట. ఎందుకులే అని వదిలేస్తారని చర్చ సాగుతోంది. ఉన్నతాధికారుల పరిస్థితే అలా ఉంటే.. కిందిస్థాయి ఉద్యోగుల గురించి వేరే చెప్పక్కర్లేదు. ఆ జేఈ.. చుక్కలు చూపిస్తాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పని చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారని తెలుస్తోంది. ఆ జేఈ నోటి దురుసుతో విసుగు చెందిన సిబ్బంది బదిలీపై వెళ్లిపోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఆ జేఈ సబ్ డివిజన్‌కు వెళ్లేవారే లేరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చినా.. ఆ జేఈని నిలదీసే సాహసం ఉన్నతాధికారులే చేయలేకపోతున్నారట.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 237600

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing), B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ :9030661651.
AJA- 237599

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

రేపు పాలిసెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన

కదిరి అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉదయం 10.30గంటలకు పాలిసెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై, సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

రైతులు... బయోమెట్రిక్ చేయించుకోవాలి

నంబులపూలకుంట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన ప్రతి రైతు బయోమెట్రిక్ చేయించుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పథకం లబ్ధి కోసం ఈ నెల 20లోగా రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ చేయించుకోవాలని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ నరసింహనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

'రైతుల అభివృద్ధే సీఎం ధ్యేయం'

ధర్మవరం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు తలారి వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోతుకుంట గ్రామంలో రైతుసేవాకేంద్రం వద్ద రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనవేరుశనగ కాయలను వారు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రవి, డీలర్ నరసింహులు, హరి, ఫీల్డ్‌అసిస్టెంట్ రాము, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లచెరువు: మండలంలోని జొగ్గన్నపేట పంచాయతీలోని బొమ్మిరెడ్డిపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను రైతులకు అందించారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది నవీన్, శీన, రమణారెడ్డి, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డీపీఆర్వోగా వేణుగోపాల్ రెడ్డి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఆర్వో

పుట్టపర్తి టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిగా (డీపీఆర్వో) వేణు గోపాల్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లా డీపీఆర్వోగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వేలాయుధం తిరుపతికి బదిలీ అయ్యారు. నూతన డీపీఆర్వో సోమవారం కలెక్టర్‌చేతన్‌ను కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు.

గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి

పుట్టపర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బీవీ నర్సారెడ్డిని గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మునిసిపల్‌శాఖ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఖాళీగా ఉన్న కడప మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

ఏఓల బాధ్యతల స్వీకరణ

కదిరిఅర్బన్/నల్లచెరువు/,జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా శ్రీహరినాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తనకల్లు ఏఓగా పనిచేస్తున్న శ్రీహరినాయక్ కదిరికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి కర్నూల్ జిల్లా జేడీఏకు బదిలీపై వెళ్లారు. నల్లచెరువు ఏఓగా లక్ష్మీప్రియ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గాండ్లపెంట ఏఓగా పనిచేస్తూ బదిలీపై నల్లచెరువుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ భారతి బదిలీపై తనకల్లు మండలానికి వెళ్లారు.

పాలపాటిదిన్నె ఆలయ ఈఓగా మురళీకృష్ణ

నల్లచెరువు: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవాలయ ఈఓగా మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తాడిపత్రి నియోజకవర్గంలోని ఎ.కొండాపురం గ్రూపు దేవాలయాల ఈఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ రవీంద్రరాజు బదిలీపై తలకోనకు వెళ్లారు.

మొరాయించిన సర్వర్

అమడగూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అన్నదాత సుఖీభవ లబ్ధిపొందే రైతులకు వేలిముద్రల ప్రక్రియ సోమవారం మండలంలోని సచివాలయాల్లో నిర్వహించారు. అయితే సర్వర్ మొరాయిస్తోందని రైతులు వాపోయారు. మండలంలోని పది సచివాలయాల పరిధిలోని రైతులు వేలిముద్ర వేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ తెలిపారు. 5,696 మంది రైతులు అర్హులన్నారు. ఇప్పటికి 617మంది రైతులు వేలిముద్రలు నమోదైయ్యాయి. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి రైతులు సర్వర్ పనిచేయకపోవడంతో పడిగాపులు కాయాల్సిన దుస్థితి. రైతులు వేలిముద్రం వేయడానికి ఈనెల 20న చివరి గడువని ఏఓ వెంకటరమణాచారి తెలిపారు.

పోలీసుల పేరుతో వసూళ్లు

● ముగ్గురిపై కేసు: సీఐ

కదిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోలీసులమని బెదిరించి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా ఇందిరాగాంధీ వీధికి చెందిన మారుతాముత్తు అనే వ్యక్తి నుంచి వసూళ్లకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మారుతాముత్తు అనంతపురం నుంచి పశువులు కొనుగోలుచేసి, వాటిని రెండు కంటైనర్లల్లో తీసుకెళ్తున్నాడు. కుటాగుళ్ల జంక్షన్ వద్ద మండలానికి చెందిన నాగభూషణ, ఆంజనేయులు, కుళ్లాయప్ప ఆ కంటైనర్లను నిలిపి దుర్భాషలాడి, రూ.20వేలు డిమాండ్ చేశారు. మారుతాముత్తు రూ.6 వేలు ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పోలీసులు విచారించి, కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి బొలేరో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బేల్దారి మృతి


మంజునాథ్ మృతదేహం

ధర్మవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవనగర్‌లో సోమవారం విద్యు దాఘాతంతో ఓ బేల్దారి మృతిచెందాడు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన మంజునాథ్(32) అనే కూలి కేశవనగర్‌లోని ఓ భవనం వద్ద పరదాలు పగులకొట్టే సమయంలో దానికి ఉన్న ఇనుపకడ్డీ అక్కడే ఉన్న పెద్ద విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతమై మంజునాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముస్లింలపై జగన్ కొత్త నాటకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

● శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సహించం
● అత్యధికంగా ట్రెండ్ అవుతున్న తల్లికి వందనం
● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముస్లింలపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరో కొత్తనాటకానికి తెర లేపారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముస్లింల విషయంలో జగన్ రాష్ట్రంలో కొత్తనాటకం ఆడుతున్నారని విమర్శించారు. అందుకు తొత్తుగా ఎంపీ అసాదుద్దీన్ ఓవైసీని వాడుకుంటున్నారన్నారు. మైనార్టీలకు రక్షణ, సంక్షేమం, అభివృద్ధి కల్పించేది ముఖ్యమంత్రి చంద్ర బాబే అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోకానీ, నవ్యాంధ్రప్రదేశ్‌లో కానీ మత ఘర్ష ణలు అదుపు చేసింది చంద్రబాబే అన్నారు. ముస్లింల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ముస్లిం పక్షపాతిగా చెప్పుకునే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, గతంలో అధికారం కోసం మత ఘర్షణలు లేపారన్నారు. పులివెందల నుంచి అల్లరి మూకలతో గొడవలు సృష్టించారన్నారు. వైసీపీ పాలనలో నంద్యాల్లో ఓ ముస్లిం కుటుంబం ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. దేశంలో అత్య ధికంగా తల్లికి వందనం ట్రెండ్ అవుతోందన్నారు. 64లక్షల మంది పిల్లలకు రూ. పదివేల కోట్లు చెల్లించామన్నారు. దీన్ని చూసి ఓర్వలేక వైసీపీ బెంబేలెత్తుతోందన్నారు. మరోవారంలో అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. నియోజకవర్గంలో శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం మోపుతామన్నారు. శిలాఫలకాన్ని పగులకొట్టిన తాగుబోతులకు వైసీపీ వంతపాడుతోందన్నారు. దొంగలకు, భూకబ్జాదారులకు, దళారులకు, ప్రభుత్వ ఆస్తులు కొట్టేసేవారికి ఇప్పుడు భయం చుట్టుకుం దన్నారు. వారికి తాను సింహ స్వప్నంగా కనిపిస్తున్నానన్నారు. ముస్లింలు జగన్మోహన్‌రెడ్డి ఉచ్చులో పడవద్దని కోరారు. ఈసమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ఇస్మాయిల్, బాహుద్దీన్, రాజేంద్ర నాయుడున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడుతాం

● మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మండలంలోని ఎం. కొత్తపల్లి, ఓడీచెరువు, వెంకటాపురం, సున్నంపల్లి, అల్లాపల్లి తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములున్నాయని, వాటి వివరాలు వెల్లడించారు. ఆ భూములను ప్రభుత్వ భవనాలు, ఆర్‌అండ్‌బీ బంగ్లా, అగ్నిమాపక కేంద్రం నిర్మించేందుకు ఉపయోగిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామమన్నారు. అందకు ముందు బీసీ కాలనీలో గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త రహంతుల్లా కుటుంబాన్ని, అదేకాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న రామాంజనేయులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఆయనతో పాటు టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, నాయకులు తుమ్మల మహబూబ్‌బాషా, ఆంజ నప్ప, పీట్ల సుధాకర్, బోరు రమణ, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో వడ్డెర్ల కమ్యూనిటీ భవనం

● ఎంపీ బీకే, మాజీ మంత్రి పల్లె ● స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ బీకే, మాజీ మంత్రి పల్లె

● ఓబుళదేవరచెరువు: వడ్డెర సామాజిక వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా మండలంలోని వడ్డెర్లకు రూ. 80లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీ బీకే, మాజీ మంత్రి పల్లె సోమవారం మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో పర్యటించారు. సర్వే నంబర్ 785-1లోని 2.55 ఎకరాల భూమిలో ఎకరా విస్తీర్ణంలో వడ్డెర కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

ఓబుళదేవరచెరువు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు సోమవారం ఎంపీ బీకే పార్థసారథికి వినతిపత్రం సమర్పించారు. మండలకేంద్రం పర్యటనకు వచ్చిన ఎంపీని కలిసి విన్నవించారు. ఆయనతోపాటు ఏఐటీయూసీ మండల కార్యదర్శి రాము, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఇంటి పట్టాలు స్వాధీనం: తహసీల్దార్

కదిరి అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని సున్నపుగుట్టతండాలో నకిలీ ఇంటిపట్టాలు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ మురళీక్రిష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆదేశాలమేరకు కదిరి పట్టణం, రూరల్ పరిధిలో ఇంటిపట్టాలు మంజూరు విషయంలో జరిగిన అవకతవకలపై నాలుగు కమిటీలను వేశామన్నారు. ఆ కమిటీలు విచారణ చేసి, సున్నపుగుట్టతండా సర్వేనెంబర్ 470లో దాదాపు 70 పట్టాలు నకిలీగా గుర్తించాయన్నారు. ఆ ఇంటి పట్టాలతోపాటు, నివాస స్థలాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి, ఈ పట్టా భూములను ప్రజా ఉపయోగార్థం వినియోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అలాగే పట్టణంలోని పార్థసారథి కాలనీ, దేవానంద్‌కాలనీ, సర్వేనెంబర్ 83 బండారు లక్ష్మణ్‌కాలనీ, ఎర్రగుంట్లపల్లి జగనన్నకాలనీల్లో నకిలీ పట్టాలపై కమిటీ విచారణ చేస్తోందన్నారు. అలాగే టిడ్కో గృహాల వెనుకనున్న జగనన్న కాలనీ, ఆర్డీవో కార్యాలయం ఎదుగా సర్వేనెంబర్ 96లో నకిలీ పట్టాలపై కమిటీ విచారణ చేస్తోందన్నారు. కమిటీ సభ్యులు నివేదిక ఇచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలిచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమాశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి 242 ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధితాధికారులు క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి పడేలా సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎఫ్ఓ చక్రపాణి, డీసీఓ క్రిష్ణానాయక్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

పుట్టపర్తి రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వశాఖ గిరిజనుల అభివృద్ధి కోసం ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ ద్వారా పలు చర్యలు చేపడుతోందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ధర్తీ అబా అభియాన్‌పథకానికి సంబందించిన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. జిల్లాలోని సోమందేపల్లి, తనకల్లు, గాండ్లపెంట మూడు మండలాల్లోని నాగేనాయినిచెరువుతండా, ముండ్లవారిపల్లి, తుమ్మలబైలు తండాల్లో గిరిజన శాఖల సమన్వయంతో ఎంపీడీఓల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ఈ సదస్సుల్లో గిరిజన ప్రజలు పాల్గొని సమస్యలను పరిష్క రించుకోవాలని కలెక్టర్ సూచించారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

● పరిటాల శ్రీరామ్‌కు మున్సిపల్ కార్మికుల వినతి


పరిటాల శ్రీరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ధర్మవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు విన్నవించారు. వారు సోమవారం పరిటాల శ్రీరామ్‌ను అనంతపురంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎకార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే తమ పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పరిటాల శ్రీరామ్‌ను కలిసిన వారిలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం జిల్లా నాయకులు అనిల్, పట్టణ సెక్రటరీ జయకృష్ణ, ఉపాధ్యక్షుడు పెద్దన్న, నాయకులు కాటమయ్య, దస్తగిరి, ఓబుళేశు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వినతి

కదిరి అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్యం, ఎన్ఎంఆర్ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమపథకాలు వర్తిం పజేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం మున్సిపల్ కమి షనర్ కిరణ్‌కుమార్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. యూనియన్ నాయకులు జనార్దన్, బాలక్రిష్ణ, తిరుపాల్, నరసింహమూర్తి, చిన్నక్రిష్ణ, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, ముస్తాక్, ఆలి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ధర్మవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక దానధర్మ ట్రస్టు సభ్యులు జిల్లా కార్తీక్ సోమవారం పట్టణంలోని స్థానిక బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థినులకు ఉచితంగా నోటు పుస్తకాలను ఆయన అందజేశారు. ప్రతి ఏడాదిలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు.

పాఠ్యపుస్తకాల అందజేత

నల్లమాడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుటాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు చాప్లా నాయక్ తెలిపారు. ప్రతి విద్యార్థికి సరిపడే పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులు, బూట్లు, సాక్సులు అందించామన్నారు.

కొరవడిన సమయపాలన

● ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్న సచివాలయ సిబ్బంది
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి విజిట్

తనకల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కోటపల్లి గ్రామ సచివాలయం సిబ్బంది సమయాపాలన పాటించడం లేదు. ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత ఉద్యోగులు వచ్చే వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా పలు విషయాలు తెలిసొచ్చాయి. ఉదయం 10గంటలకు కార్యాలయానికి రావాల్సిన సిబ్బంది ఎవరూ హాజరుకాలేదు. అయితే ముండ్లవారిపల్లి, బీమ్లా నాయక్‌తండా, దండువారిపల్లి, దేవళం తండా, కోటపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఉదయం 9.30 గంటలకే సచివాలయం వద్దకు వేచి ఉన్నారు. ఉదయం 10.52 నిమిషాలకు వెల్ఫేర్ అసిస్టెంట్ వచ్చారు. దీంతో ప్రజలం దరూ ఒక్కసారిగా లేచి కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించారు. తమ పనులకు సంబంధించిన సిబ్బంది ఇంకా రాకపోవడంతో నిరాశతో ప్రజలు ఎదురు చూస్తూ నిలబడ్డారు. అనంతరం ఉదయం 11 గంటలకు కార్యదర్శి హాజరయ్యారు. మిగిలిన సిబ్బంది తరువాత ఒకొక్కరుగా సచివాలయానికి వచ్చారు. ఉదయం 10గంటలకు రావాల్సిన అధికారులు 11 గంటలైనా రాకపోవడం ఏమిటని వారిలో పలువురు చర్చించు కోవడం మొదలు పెట్టారు. సచివాలయం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది సకాలంలో చేరుకుని విధులు నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోవడం ఏమిటని ప్రజలంటున్నారు. పర్యవేక్షణ చేసే వారు లేకనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టమొచ్చినప్పుడు రావడం, వెళ్లిపోవడం వారికి పరిపాటిగా మారిందని ప్రజలు అంటున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, చర్చించి సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లికి వందనంపై సంబరాలు

● సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం


బుక్కపట్నంలో క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుచేయడంతో విద్యార్థుల తల్లుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిస్తోందని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దీంతో సోమవారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.



● గాండ్లపెంట: మండలవ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.13వేల వంతున ప్రభుత్వం జమ చేసింది. దీంతో గాండ్లపెంట ఉన్నతపాఠశాలలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.



● తనకల్లు: తల్లికి వందనం కార్యక్రమం విజయవంతం కావడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మండలంలోని ఈతోడు పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు.

కిక్కిరిసిన బ్యాంకులు


ఓబుళదేవరచెరువులో తల్లికి వందనం డబ్బు కోసం క్యూకట్టిన మహిళలు

ఓబుళదేవరచెరువు, జూన్16 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న పిల్లలకు తల్లికి వందనం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం వారి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. వాటి కోసం వచ్చిన మహిళలతో సోమవారం మండలంలోని బ్యాంక్‌లు కిక్కిరిశాయి. మరో పక్క డబ్బులు పడక, పేర్లు లేక మరికొంతమంది మహిళలు సచివాలయాల వద్ద, ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు అందించారు. తల్లికి వందనం డబ్బులు చాలమందికి పడినట్లు సోమవారం సెల్‌ఫోన్లకు మెసైజ్‌లు రావడంతో డబ్బులకోసం పాస్‌పుస్తకాలు చేతపట్టుకుని మహిళలు బ్యాంక్‌లో బారులు తీరారు.

నిధులు మంజూరు చేయండి: సర్పంచ్

నల్లమాడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ నల్లమాడలో చేసిన పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ రమావత్ భారతి ప్రభుత్వాన్ని కోరారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... పంచాయతీలో నూతనంగా బోర్లు వేయించామన్నారు. బోర్లకు మోటార్లు, స్టాటర్లు అమర్చి నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే మోటార్ల మరమ్మతులు, మురుగునీటి కాలువల మరమ్మతులు తదితర పనులు చేశామన్నారు. ఈ పనులకు నిధులు లేకపోవడంతో అప్పులు చేసి సమస్యలను పరిష్కరించామని తెలిపారు. వీటికి దాదాపు రూ.50 లక్షలు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉందన్నారు. నూతన ప్రభుత్వం వచ్చినప్పటినుంచి రూ.50లక్షలు తమ పంచాయతీకి రావాల్సి ఉంది. ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

క్రికెట్ కిట్ అందజేత


క్రికెట్ కిట్ ఇస్తున్న సంధా రాఘవ, సంధా రవి

ధర్మవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో రాణించి ధర్మవరానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవ, సంధా రవి రేఖారాణికి సూచించారు. వారు సోమవారం పట్టణంలోని వెంకటరమణ కుమార్తె రేఖారాణికి క్రికెట్ కిట్‌ను అందజేశారు. రేఖారాణి జీవన్‌జ్యోతి పాఠశాలలో చదువు తోంది. ఈ విద్యార్థిని క్రికెట్ పట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తోంది. క్రికెట్‌లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుండటంతో చేనేత ప్రముఖులు ఆమెకు క్రికెట్ కిట్ బహూకరించారు.

బడి పిల్లలతో పనులు


విద్యార్థులచే కుర్చీలు మోయిస్తున్న దృశ్యం

గాండ్లపెంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల తీరు మారలేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పిస్తారని పిల్లలను పాఠశాలకు పంపితే, అక్కడ ఉపాధ్యాయులు వారితో పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గాం డ్లపెంట ఉన్నత పాఠశాలలో సోమవారం ఓ సమావేశం నిర్వహిం చారు. సమావేశం తరువాత ఎమ్మార్సీ నుంచి తీసుకొచ్చిన కుర్చీల ను విద్యార్థులచే మోయించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నా యి. పాఠశాలలో ఇద్దరు స్వీపర్లు, ఒక వాచ్‌మ్యాన్, ఇతర సిబ్బంది ఉన్నా, విద్యార్థులచే కుర్చీలు మోయించడం ఏమిటని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ పాఠశాలలో గతంలో పలుమార్లు పిల్లలతో పనులు చేయించిన సంఘటనలు అనేకమున్నాయి. ఇప్పటికి కూడా ఉపాధ్యాయుల తీరు మారడంలేదని తల్లిదండ్రులు, గ్రామస్థులు మండిపడుతున్నారు.

కష్టపడ్డవారికి పార్టీ అండ

ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూన్16(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీకి అండగా ఉండి పార్టీని అధికారంలో తెచ్చేందుకు కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల కమిటీ ఎంపికపై నాయకులు కార్యకర్తల అభిప్రాయాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఉన్నంత కార్యకర్తల బలం మరో పార్టీకి లేదన్నారు. గత ప్రభుత్వం అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారని అలాంటి వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ పదువుల్లో సైతం అలాంటి వారికే ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆర్.జయకుమార్, ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించండి

కార్మిక సంఘం నాయకుల డిమాండ్.. సచివాలయం ఎదుట ధర్నా


పాలసముద్రంలో ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం అసెంబ్లీ కన్వీనర్ కొండా వెంకటేశ్ ఆధ్వర్యంలో పాలసముద్రం గ్రామస్థులు సచివాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తాము కట్టించుకున్న ఇళ్లకు సంబంధించి హక్కుపత్రాలు ఇవ్వాలని కోరారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కార్యదర్శి మస్తాన్, వీఆర్‌ఓ రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు స్వర్ణలత, అంజలి, ఆంజనేయులు, లక్ష్మీదేవి, సత్యమ్మ, శోభ, గంగమ్మ పాల్గొన్నారు.

'అన్నదాతా సుఖీభవ'కు సర్వర్ కష్టాలు

రైతులకు తప్పని నిరీక్షణ

రొద్దం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ లబ్ధిదారులకు సర్వర్ కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈనెల 20 నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేసేందుకు సన్నద్ధం అవుతోంది. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు వేలిముద్ర వేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని 15 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి వేలిముద్ర వేయించుకోవడం వ్యవసాయాధికారులు మొదలుపెట్టారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు తరలివచ్చారు. అయితే ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు బాగానే పనిచేసిన సర్వర్ అప్పటి నుంచి 5గంటల వరకు పనిచేయకపోవడంతో రైతులు నిరీక్షించాల్సి వచ్చింది. ఆర్.కొట్టాల, పెద్దగువ్వలపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఎంతసేపు వేచి చూసినా సర్వర్ పనిచేయకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు.

సమస్యలు పరిష్కరించండి: పీడీఎస్‌యూ

హిందూపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై పట్టణంలోని ఎస్సీ, బీసీ, ఎఎస్‌డబ్ల్యు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ డివిజన్‌వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఏఎస్‌డబ్ల్యు అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాజు, నాగేంద్ర, మహేంద్ర, శేషు, అనుదీప్, రవి, రాజేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి పాదుకల ఊరేగింపు

చిలమత్తూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సాయి పాదుకల సేవ సోమవారం భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు సాయి కీర్తనలు ఆలపిస్తూ సాయి పాదుకలను ఊరేగించారు. ఈ సందర్భంగా సేవా ట్రస్టు జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ సాయిబాబా బోధించిన ప్రేమ, సేవ గుణాలను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాత్మిక సమన్వయకర్త శంకరనారాయణ, సేవాదళ్ విభాగ సమన్వయకర్త సీతారాములు, రామయ్య పాల్గొన్నారు.

'తల్లికి వందనం'పై సంబరాలు


చంద్రబాబు, బాలయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

హిందూపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తల్లికి వందనం కింద నగదు జమ చేయడంతో సోమవారం బసవనపల్లి పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రూరల్ మండల టీడీపీ కన్వీనర్ హెచ్‌ఎన్ రాము మాట్లాడుతూ తల్లికి వందనం విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంతగానో భరోసా ఇచ్చిందన్నారు. పాఠశాలలు తెరుస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ మొత్తాన్ని చదువుకోసమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాకె ఆంజనేయులు, మదనగోపాల్‌రెడ్డి, మల్లికార్జున, ముస్తషా, సురేష్, ఆసిఫ్, రామగిరి సూరి పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం

చిలమత్తూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో అర్హులకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయంలో తల్లికి వందనం పథకంలో తల్లుల ఖాతాల్లోకి నగదు జమ కాని వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన దగ్గరుండి పథకం ఎందుకు వర్తించలేదు. పొరపాట్లు ఎక్కడ జరిగాయి? వాటిని ఎలా పరిష్కరించుకోవాలి? తదితర విషయాలపై స్థానిక సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నగదు ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు. ఎలాంటి అపోహలు నమ్మవద్దన్నారు.

ముద్దాయిలకు ఆరు నెలల జైలుశిక్ష

సోమందేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లిలో కర్ణాటక మద్యం అమ్ముతూ పట్టుబడిన వడ్డె ఆంజనేయులు, ఉప్పర ఓబులేసును సోమవారం పెనుకొండలోని కోర్టుకు హాజరుపరచగా వారికి ఆరు నెలలు జైలు, రూ.6వేలు జరిమానా కోర్టు విధించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కందిపంట సాగుకు రైతులు సన్నద్ధం

రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులోలేని ఎరువులు


కందిపంట సాగుకు సిద్ధం చేసిన పొలం


కలిపి రైతు సేవా కేంద్రంలో ఉన్న నాలుగు బస్తాల యూరియా

రొద్దం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముంగారు సేద్యం పనులు పూర్తీ చేసుకుని రొద్దం మండలంలో 20వేల ఎకరాల్లో కందిపంట సాగుకు రైతులు సన్నద్ధం అయ్యారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు ఏడాదికేడాది కంది పంటసాగును విరివిగా సాగుచేస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే రొద్దం మండలం వేరుశనగ సాగుకు ప్రసిద్ధి చెందింది. అయితే చీడపీడలు అధికం కావడం, దిగుబడులు రాక పెట్టుబడి ఖర్చులు భారమై అప్పుల అధికమై వేరుశనగ పంటను సాగు చేయడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ పెట్టుబడి ఖర్చులతో కందిపంట సాగుచేసి అత్యధిక ఆదాయం పొందుతున్నారు. దీనికితోడు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులకు మరింత ఆదాయం, లబ్ధి చేకూరుతోంది. అయితే ప్రస్తుతం రైతులు కందిపంట సాగుకు సన్నద్ధం అవుతున్నా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారరు. సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా అందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయాధికారులు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పావగడ, వెంకటాపురం, తిరుమణి ప్రాంతాలకు వెళ్లి ఎరువులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రైతులు అంటున్నారు.

అందుబాటులో నాలుగు బస్తాల యూరియా

రొద్దం మండలం కలిపి సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రంలో నాలుగు బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉంది. రొద్దం మండల పరిధిలోని 63 గ్రామాల్లో 15 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అయితే ఏ ఒక్క రైతు సేవా కేంద్రంలోనూ రైతులకు సరిపడా ఎరువులు వ్యవసాయ యంత్రాంగం అందుబాటులో ఉంచకపోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులు సాగుకు సిద్ధంగా ఉన్నా వ్యవసాయ అధికారులు ఎరువులు, యూరియాలను అందుబాటులో ఉంచకపోవడం దారుణమని అంటున్నారు.

కర్ణాటక నుంచి తెచ్చుకుంటున్నాం



రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటక ప్రాంతం వెంక టాపురం నుంచి ఎరువులు కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం సకాలంలో ఎరువులు సరఫరా చేస్తే రైతులకు మేలు చేసిన వారవుతారు. డీఆర్ కొట్టాల గ్రామంలో ఒక్కో రైతు 30ఎకరాల నుంచి 270ఎకరాల వరకు సాగుచేస్తాం.

-నాగేష్‌నాయుడు, రైతు, డిఆర్ కొట్టాల

60 ఎకరాల్లో సాగు చేస్తున్నా



60ఎకరాల్లో కందిపంట కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా. ప్రభుత్వం విత్తనంసాగు చేసే సమయానికి ఎరువులు సరఫరా చేయాలి. పెట్టుబడి ఖర్చులు తడిచి మోపెడవుతున్న సమయంలో ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయలేకపోతున్నాం.

-శ్రీనివాసులు, కౌలురైతు, ఆర్.మరువపల్లి

ఎరువులు సరఫరా చేస్తాం

జిల్లావ్యాప్తంగా విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నాం. అనంతరం ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులోకి తెచ్చి సరఫరా చేస్తాం. ప్రతి యేడాది విత్తన వేరుశనగ పంపిణీ అనంతరం ఎరువులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సంయుక్త సహాయ సంచాలకుడు

చెత్తతో సంపద సృష్టించిన నేత చంద్రబాబు

మంత్రి సవిత


డంపింగ్ యార్డులో రీసైక్లింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి దుకాణాలు, ఇతర వ్యాపారాల ద్వారా సేకరించిన చెత్తనుంచి సంపద సృష్టించిన నేత చంద్రబాబు అని అదే చెత్తపై వైసీపీ పాలనలో పన్నువేసిన దుర్మార్గుడు జగన్ అని మంత్రి సవిత అన్నారు. సోమవారం కొండ రోడ్డుకువెళ్లే సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌లో ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, పొడి చెత్త ద్వారా తయారైన వాటిని ఎరువులుగా తయారుచేసి రైతులకు నర్సరీలకు సరఫరా చేస్తామన్నారు. అందుబాటులో ధరలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, కేశవయ్య, మండల కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, గుట్టూరు సూరీ, త్రివేంద్ర పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ ప్రారంభం

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్మించిన నూతన ఎస్సీ బాలికల హాస్టల్‌ను సోమవారం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1.94కోట్లుతో బీసీ బాలికల హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో ఆగిన హాస్టల్‌ను తాము అధికారంలోకి రాగానే అదనంగా రూ.50లక్షలు మంజూరుచేసి పూర్తి చేయడం జరిగిందని వివరించారు. చెప్పిన విధంగానే తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామన్నారు. మంత్రి నారాలోకేష్ చొరవతో తల్లికి వందనంతోపాటు సన్నబియ్యం, సర్వేపల్లి రాధకృష్ణ విద్యార్థి కిట్‌లు అందజేశామన్నారు. ముద్దుల మావయ్య జగన్ కాదు అని నారాలోకేశ్ అని పేర్కొన్నారు. వచ్చే యేడాది బాలుర కోసం వసతి గృహాన్ని నిర్మిస్తామన్నారు. అనంతరం హెచ్‌ఎం గదిలో రికార్డులు తనిఖీ చేశారు. హెచ్‌ఎం జబీనా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో సన్నబియ్యంను మంత్రి పరిశీలించారు. అలాగే పాఠశాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు నాణ్యంగా లేకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, వెంకటరమణ, కన్వీనర్ వెంకటేశులు, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, కిష్టప్ప, సూరీ, సూర్యనారాయణ, అంజినరెడ్డి, ఆది పాల్గొన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): మంత్రి సవితను సోమవారం తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షులు సీసీహరి బృందం ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో చేనేతలు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అబివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖల మంత్రి సవిత మంగళవారం పర్యటించనున్నట్లు టీడీపీ కన్వీనర్ బాలకృష్ణచౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గోరంట్ల బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి సంత మార్కెట్ వరకు, ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. మదలపల్లి పంచాయతీలోని ఖాజాపురం, కేజీబీవీ పాఠశాలలో డైనింగ్ హాల్‌కు భూమి పూజ, కల్లితండాలో 11 గంటలకు వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.50లక్షల చెక్కును అందచేస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వైభవంగా నవగ్రహ ప్రతిష్ఠ

లేపాక్షి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పులమతి పంచాయతీ సడ్లపల్లి గ్రామంలో సోమవారం శివాలయంలో నవగ్రహప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కలశపూజ, కళాకర్షణ, నేత్రోన్మీలన, ప్రాణప్రతిష్ఠాపన, గణపతి నవగ్రహపూజ, పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితుల నడుమ శివాలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

నాటుసారాను అరికట్టాలి

మహిళల ధర్నా

గుడిబండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎస్ తండాలో నాటుసారాను అరికట్టాలని కోరుతూ మహిళా సంఘాల సభ్యులు గుడిబండ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. సోమవారం జీఎస్ తండా గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు పెద్దఎత్తున తరలివెళ్లి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా తయారు చేయడం, విక్రయించడంవల్ల చిన్న పెద్ద అనే తేడాలేకుండా సేవించి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయన్నారు. నాటుసారా సేవించి గ్రామాల్లో ప్రతి రోజూ గొడవలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి నాటుసారా తయారీ, విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ కళ్యాణచక్రవర్తికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం తిప్పన్న, సీసీ శ్రీధర్, యానిమేటర్ నాగభూషణ, గ్రామ మహిళా సంఘం సభ్యులు భీమబాయి సుశీలమ్మ, అమల, భారతి, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం అందిస్తున్న మహిళా సంఘం సభ్యులు

బాధ్యతల స్వీకరణ


విజయభారతి

సోమందేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారిగా విజయభారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె పరిగిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కవితారాణి చిలమత్తూరుకు బదిలీపై వెళ్లారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెనుకొండ రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సాగుచేసే రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పండ్లతోటలపై వచ్చే రాయితీలను వివరించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఎన్‌ఎఫ్‌ఎ సాకప్ప పాల్గొన్నారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోండి'

పావగడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ సూచించారు. సోమవారం గురుభవన మైదానంలో గంగా కళ్యాణి పథకం కింద 61 మంది రైతులకు బోరుబావికి సంబంధించి పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మోటార్ పంపుసెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ఉచిత కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక భరోసా


కుట్టుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, కమిషనర్

హిందూపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించవచ్చని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున అన్నారు. సోమవారం పట్టణంలోని ధర్మపురం షాదీమహల్‌లో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90రోజుల్లో శిక్షణ పొందవచ్చన్నారు. 75శాతం హాజరు ఉంటే సర్టిఫికెట్, కుట్టుమిషన్ ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశ్వర్థ, నారాయణ, అంజి, షబ్బీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలపై సమీక్ష

పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు సోమవారం చైర్మన్ రమేష్‌తో సమావేశమయ్యారు. బదిలీలు, పదోన్నతులపై చర్చించారు. ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సమన్వయంగా పనిచేయాలన్నారు. పాఠశాలలో చదువులు చెప్పకుండా రాజకీయాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాస్, హెచ్‌ఎంలు రంగనాయకులు, సామ్రాజ్యం, చంద్రశేఖర్, పెన్నోబుళం, రమణ, కృష్ణమోహన్, రోహిణి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన బ్యాంకులు.. పోస్టాఫీసులు


పోస్టాఫీసులో నగదు కోసం వేచి ఉన్న జనం

హిందూపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనంకు సంబంధించిన మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఆ మొత్తాన్ని డ్రా చేసుకునేందుకు పట్టణంలోని తపాలా ప్రధాన కార్యాలయంతోపాటు బ్యాంకుల వద్ద మహిళలు పెద్దఎత్తున క్యూకట్టారు. పోస్టాఫీసువద్ద అయితే ఉదయం 6గంటల నుంచే క్యూలో ఉన్నారు. ఇటీవల అధిక శాతం మంది పోస్టాఫీసుల్లో అకౌంట్ చేయించుకున్నారు. దీంతో తల్లికి వందనం మొత్తం తపాలా కార్యాలయాలకు జమ అయింది. దీనికారణంగా మహిళలు తపాలా కార్యాలయానికి క్యూకట్టారు.

ఏఓ బదిలీ

రొళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖాధికారి రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు. దీంతో సిబ్బంది సోమవారం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసన్న, కిరణ్, నళిని, వెంకటేశ్ పాల్గొన్నారు.

24న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

అగళి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జాఫర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 20న ఆఖరు తేదీ అని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 24న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

సోమందేపల్లి, జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లివద్ద గుంతలు పడి అధ్వాన్నంగా మారిన రోడ్డుకు సోమవారం స్థానిక టీడీపీ నాయకులు శ్రీరాములు మరమ్మతులు చేపట్టారు. పెనుకొండ-హిందూపురం రహదారిలో చాకర్లపల్లివద్ద రోడ్డు అధ్వాన్నంగా మారడంతో వాహనదారుల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో రంగేపల్లి బూత్ కన్వీనర్ రంగ, శ్రీధర్, హరి, మంజు పాల్గొన్నారు.

వంటసామగ్రి ధ్వంసం

గోరంట్ల, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటగదిలో ఉన్న పాత్రలు, ఇతర సామగ్రిని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు పాఠశాల కమిటీ చైర్మన్ జైపాల్ తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

రొద్దం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అదనపు విద్యుత్‌లోడ్ కలిగిన వారికి క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ప్రకటించిందని రొద్దం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వినియోగదారుడు అదనపు లోడ్ కలిగి ఉంటే ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 1కేవీ విద్యుత్ లోడ్ కలిగిన వినియోగదారుడు 2250 ఉండగా రాయితీపోను రూ.1250 చొప్పున చెల్లించాలన్నారు. 1నుంచి 5కేవీ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు పావగడకు నిఖిల్‌కుమార స్వామి

పావగడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ నాయకుడు నిఖిల్ కుమార స్వామి మంగళవారం పావగడలో పర్యటించనున్నట్లు తాలూకా అధ్యక్షుడు ఎస్ఎ ఈరన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పార్టీ బలోపేతానికి మిస్డ్‌కాల్ అభియాన కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని శిర రోడ్డులో ఉన్న ఆంజనేయశెట్టి కల్యాణమండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు బలరాంరెడ్డి, శివకుమార్, రాజశేఖర్, జేడీఎస్ ప్రధాన కార్యదర్శి సొగడు వెంకటేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

మడకశిర టౌన్, జూన్16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మధుగిరి రోడ్డు మారుతీనగర్ సమీపంలో సిమెంట్ లోడ్డుతో తాడిపత్రి నుంచి కర్ణాటక రాష్ట్రం మండ్యకు వెళ్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను సోమవారం ఉదయం ఢీకొంది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. సిమెంట్ బస్తాలను మరో లారీలో ఎక్కించి రోడ్డును క్లియర్ చేశారు.

జయప్రదం చేయండి

సోమందేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని నాయకులు బాలస్వామి కోరారు. సోమవారం మండలంలోని ఈదులబళాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అన్నిశాఖలు కలుపుకుని ఈనెల 20న సోమందేపల్లి కేంద్రంలో నిర్వహించే మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామశాఖ సభ్యులు నాగరత్న, నారాయణ, లక్ష్మీనరసమ్మ, మంజుళ, నరసింహులు, శ్రావణి, ఆదెమ్మ పాల్గొన్నారు.

ప్రకటన

N. మంజుల W/o V. గిరీష్ కుమార్, D.No . 3-3-3, కొడిగెనహళ్ళి గ్రామం, పరిగి మండలం, శ్రీసత్యసాయి జిల్లా. Doc.No.9428/ 2011, 9427/2011 సర్వే నెం.266-2Gలో ప్లాట్ నెం. 22, 23లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందూపురం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్నచో 7 రోజుల లోపు హిందూపురం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.

ప్లాట్ నెం.22 హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.23 పైకి ఖాళీస్థలం, పడమర: ప్లాట్ నెం.21, ఉత్తరం: 18అడుగుల రోడ్డు, దక్షిణము: ఆదిమూర్తి ఖాళీ స్థలం.

ప్లాట్ నెం.23 హద్దులు : తూర్పు : ఆంజినేయులు ఖాళీస్థలం, పడమర: ప్లాట్ నెం.23, ఉత్తరం: 18 అడుగుల రోడ్డు, దక్షిణము: ఆదిమూర్తి ఖాళీ స్థలం.

H. నాగేశ్వరరావు, అడ్వకేట్, హిందూపురం.